ఆంధ్రప్రభ - 29-05-2000

# నేటి మనసులు

'వైటుకె' ధర్మమా అంటూ అమెరికా వేళ్లే ప్రయత్నంలో సఫలుడై, హైటెక్ సిటీ హైదారాబాద్‌లో ఉంటున్న సుందరం అనే ఓ ఇంజనీరు కుర్రాడు తల్లిదండ్రులతో సహా పెళ్లిచూపులకని మంగళగిరి వెళ్లాడు. అదే ఊళ్లో ఉంటున్న వాళ్ల పిన్నిగారింట్లో దిగి, మంచి ముహూర్తం చూసుకుని పిల్ల ఇంటికి వెళ్లారందరూ. శ్యామ్రావు దంపతులు వారికి అతిథి మర్యాదలు చేసి, కూతురు స్రవంతి ఎం.ఏ.ని తీసుకొచ్చి సుందరానికి ఎదురుగా ఓ కుర్చీలో కూర్చోబెట్టారు.

సుందరం తల్లిదండ్రులకి స్రవంతి వెంటనే నచ్చేసింది. సుందరం చూపు స్రవంతి వెనుకగా, లోపలి గుమ్మం దగ్గర నిల్చున్న ఓ చామనఛాయ రంగుకల అమ్మాయి మీద పడింది. లేత నీలిరంగు సాదా నూలుచీర కట్టుకుని, ముఖాన పావలా కాసంత ఎర్రని బొట్టు పెట్టుకున్న ఆమె చాలా ఆకర్షణీయంగా కనపడింది. స్రవంతిని తన తల్లి ఏవో ప్రశ్నలడుగుతూన్న సమయంలో, సుందరం మార్చి మార్చి ఇద్దరమ్మాయిల్నీ గుంభనగా చూశాడు. ఆ తర్వాత సుందరం ఏదో మాటవరసకి నాలుగైదు మాటలు మాట్లాడి పెళ్లిచూపుల తంతు ముగించాడు.

సుందరం తల్లిదండ్రులకి స్రవంతి నచ్చిన విషయం అప్పటికప్పుడే చెప్పాలనిపించింది. దానికి రెండు కారణాలు - మొదటి కారణం లక్షకు పైగా కట్నం. ఇహ రెండో కారణం స్రవంతి నాజుగ్గా, తెల్లగా, అందంగా ఉంది. తల్లిదండ్రుల ఉబలాటం చూసి, సుందరం వారిని కనుసన్నలతో వారించాడు. కొడుకు అభిమతం తెలుసుకుని, ఆ తర్వాతే అంగీకారం తెలియజేయడం మంచిదని గ్రహించిన వాళ్లు, నిర్ణయం త్వరలోనే తెలియజేస్తామని బయట పడ్డారు.

పిన్నిగారింటికి తిరిగి వెళ్లిన తర్వాత, పన్నెండో క్లాసు చదువుతున్న పిన్ని కొడుకు అరుణ్ ద్వారా స్రవంతి వెనుక నిల్చున్న అమ్మాయిని గురించి కొన్ని వివరాలు సేకరించాడు. ఆ అమ్మాయి పేరు సూర్యకాంతం. శ్యామ్రావుగారి పక్కింట్లో ఉంటున్న వెంకటాచలం మాస్టారి కూతురు. స్రవంతికి క్లాస్‌మేటు. ఆర్థిక స్తోమత లేకపోవడం మూలాన, బి.ఏ. మొదటి సంవత్సరంలోనే చదువు ఆపేసింది. మంగళగిరి మునిసిపల్ లైబ్రరీలో తాత్కాలికమైన ఏదో చిన్న ఉద్యోగం చేస్తోంది. వెంకటాచలం మాస్టారు సూర్యకాంతం పెళ్లి విషయమై కొన్ని ప్రయత్నాలు చేసి, అతిసామాన్యమైన కుర్రాళ్లు కూడా అందనంత ఎత్తులో ఉండటం మూలాన నిరాశ చెంది, దిగులుపడ్డ జీవితాన్ని గడుపుతున్నాడు.

ఆ రోజు రాత్రి భోజనాల సమయంలో సుందరం పిన్ని, 'మహాలక్ష్మి' అడిగింది - "ఏయ్. సుందరం! మీ అమ్మా నాన్నలకి స్రవంతి నచ్చింది. స్రవంతి తన అంగీకారం తెలిపిందని

శ్యామ్రావుగారు కబురంపారు. నీ అంగీకారం తెలపడం ఒక్కటే ఆలస్యం. రేపే వాళ్లు తాంబాలాలిచ్చుకోవడం కోసం సిద్ధంగా ఉన్నారు. ఏమంటావు?"

సుందరం అందర్నీ చూస్తూ అన్నాడు – "నా సమాధానం మీకు విచిత్రంగా వినిపించవచ్చు. స్రవంతి వెనుకగా నిల్చున్న వెంకటాచలం మాస్టారి కూతురు సూర్యకాంతం నాకు నచ్చింది. బాబాయ్! మీరు వెళ్లి వెంకటాచలం మాస్టారితో మాట్లాడండి. వాళ్లు కనుక ఒప్పుకుంటే వెంటనే ముహూర్తం పెట్టించండి. పైసా కూడా కట్నంగా వద్దని చెప్పండి. ఈ పెళ్లి కనుక జరిపిస్తే మీకందరికీ ఆజన్మాంతం ఋణపడి ఉంటాను!"

"అక్కని చూసుకోడానికి వెళ్లి చెల్లెలు నచ్చిందన్న ఉదంతాలు ఎన్నో విన్నాను కానీ, పెళ్లిచూపులకని ఓ ఇంటికి వెళ్లి, పక్కింటి పిల్ల నచ్చిందని వినడం నాకిదే మొదటిసారి! అక్కా! నీ కొడుకు సుందరం మనసు తెలిసింది కదా! వాడిష్టప్రకారమే చేయడం బావుంటుంది మరి!" అంది మహలక్ష్మి. సుందరం తల్లిదండ్రులు వివేకవంతులు. చేజారిన కట్నం విషయమై మనసు కొంచెంగా నసిగినా, "నీకు పెళ్లి కావడం మాకు ముఖ్యం, అంతా నీ ఇష్టం!" అన్నారు సుందరంతో. నిజానికి పెళ్లి కాకుండా సుందరం అమెరికా వెళ్లడం వాళ్ల కిష్టం లేదు.

సుందరం బాబయ్య, భోజనాలైన తర్వాత వెంకటాచలం మాస్టారింటికి వెళ్లి, రాత్రి పదింటికి తిరిగి వచ్చాడు.... "మన హృదయ వైశాల్యానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుకుని, వరించి వస్తున్న అదృష్టాన్ని కాదంటున్నందుకు క్షమించమన్నాడు. ఆయనన్న మాటల సారాంశమిది. వారివురి కుటుంబాలూ దాదాపు ఇరవై సంవత్సరాలుగా ఇరుగు పొరుగులుగా జీవిస్తూ వచ్చాయి. ఈ రోజున ఈ సంబంధాన్ని ఒప్పుకుని శ్యామ్రావుగారి దృష్టిలో దిగజారడం వెంకటాచలం మాస్టారి కిష్టం లేదు!"

మర్నాడు ఉదయం అందరూ గుడికి వెడితే, సుందరం మటుకు చల్లగా జారుకుని శ్యామ్రావుగారింటికి వెళ్లి, జరిగిందంతా నిజం దాచకుండా ఆయనకీ, స్రవంతికీ చెప్పాడు. తండ్రీ కూతుళ్లిద్దరూ ఒక్క క్షణం ఒకరి మొహాల్లోకి మరొకరు చూసుకున్నారు. స్రవంతి చిరునవ్వు చూసి, శ్యామ్రావు సుందరాన్ని తీసుకుని వెంకటాచలం మాస్టారింటికి వెళ్లాడు. వెనకగా స్రవంతి కూడా వెళ్లింది.

"మాస్టారూ! ఇతనే సుందరం – ఉన్నతమైన ఆలోచనలతో మీరితని బాబాయిగారితో అన్న మాటలన్నీ చెప్పాడు. నాపట్ల మీరు చూపించిన గౌరవానికి జోహార్లర్పిస్తున్నాను. సూర్యకాంతాన్ని కోరి చేసుకుంటానంటున్నాడు. పిల్ల కభ్యంతరం లేకపోతే, ఈ వివాహానికి అంగీకరించండి!" అన్నాడు శ్యామ్రావు. మాస్టారి కళ్ల నుండి జారిన కన్నీటి చుక్కలు కృతజ్ఞతలు తెలిపాయి.

ఆ పెళ్లి జరిగిందని వేరే చెప్పనక్కర్లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా జరగని పనులు, ఒక్కోసారి వాటంతటవే జరిగిపోతాయి. 'ఘటన' అంటే ఇదే కాబోలు.

• • •

"మానవ సంబంధాల్నీ విలువల్నీ అంశంగా తీసుకుని క్లుప్తంగా వ్రాశావు. బాగానే ఉంది

కానీ, కమ్మటి 'చారుకి ఇంగువ పోపు' ఎలా అవసరమో, కథలో కూడా కాస్త శృంగారపు మెరుపులుండాలి!" అన్నాడు కథ చదివిన ఓ స్నేహితుడు.

❁ ❁ ❁

మొదటి రాత్రి సూర్యకాంతం సుందరం ఒడిలో తలపెట్టి పడుకుని, "స్రవంతి తెల్లగా, నాజూగ్గా, అందంగా ఉంటుంది. విద్యాధికురాలు, ఐశ్వర్యవంతుల ఇంట్లో పుట్టి పెరిగింది. అయినా కాదని నన్ను చేసుకున్నారు. నాలో ఏం చూసి చేసుకున్నారు?" అంది కాస్త సంకోచిస్తూ.

"అందానికీ, ఆకర్షణకీ భాష్యం చెప్పలేను. అయినా అడిగావు కాబట్టి ఏదో సమాధానం చెప్పాలి కదా! మన మొదటి కౌగిలింతలో నా ఛాతీని ప్రతిఘటించాయే" సుందరం ఇంకా ఏదో అనబోతుండగా సూర్యకాంతం తన చేతివేళ్లతో అతని పెదవుల్ని మూసింది.

'పుర్రెకో బుద్ధీ, జిహ్వకో రుచీ' అంటే ఇదే కాబోలు!

❁ ❁ ❁

"అసలు దీన్ని మొదటి నుంచీ హాస్యధోరణిలో రాస్తే చాలా బాగుండేది!" అన్నాడు మరో స్నేహితుడు.

"తిరిగి రాయడానికి ఓపిక లేదు. కావాలంటే కొసమెరుపు తగిలిస్తాను!"

❁ ❁ ❁

నాలుగు నెలల తర్వాత ఓ ప్రముఖ వారపత్రికలో సలహాల శీర్షికలో అడగబడిన సమస్యలలో ఓ రెండు సమస్యలివి:

1. అరుంధతి కొమరగిరి,

నేను తెల్లగా, నాజుగ్గా, అందంగా ఉంటాను. అయినా వచ్చిన సంబంధాలన్నీ వెనక్కి వెడుతున్నాయి. వక్షోజాలు పెద్దవిగా అయ్యే మార్గం చెప్పండి.

2. లక్ష్మీకాంతం, హైటెక్ సిటీ.

మావారు నా అవయవ సంపదని చూసి, ముచ్చటపడి నన్ను వివాహం చేసుకున్నారు. వయసుతోపాటు బిగి సడలితే మావారు నన్ను సరిగ్గా చూసుకుంటారో లేదోనన్న భయం ఇప్పట్నించే పీడిస్తోంది. అంగసౌష్ఠవం కాపాడుకునే మార్గాలు చెప్పగలరు.

❁ ❁ ❁

ఎవరి గోల వారిది! పీత కష్టాలు పీతవి! పై సమస్యలకి సలహాలేమిచ్చారన్నది ముఖ్యం కాదు. ఆస్తులూ, అంతస్తులూ, ఉద్యోగాలూ, హోదాలూ, సంప్రదాయాలూ కొన్ని కొలమానాలైనా, స్త్రీ పురుషులు దాంపత్య జీవితంలో కూడా అంతరాంతరాలలో వాంఛించేది ఆకర్షణీయమైన శరీరాలు గల భాగస్వాముల్ని. 'అందులో ముఖసౌందర్యం ప్రాముఖ్యం ఎంత?' అని ప్రశ్నిస్తే, స్త్రీ కొన్ని ఎక్కువ మార్కులూ, పురుషుడు కొన్ని తక్కువ మార్కులూ వేసే అవకాశం లేకపోలేదు.

❁ ❁ ❁

రెండో సమస్య అడిగిన వారి చిరునామాని కాస్త శ్రద్ధగా పరిశీలిస్తే, సుందరం అమెరికా ప్రోగ్రాం 'క్రాష్' అయిందేమోనన్న సందేహం కలగక మానదు. ఆ సందేహం కనుక నిజం కాకపోతే, అమెరికాలో కూడా హైటెక్ సిటీ అనే ఓ పట్టణం ఉండి ఉండాలి. ❁